


# కడుపు కోత

క్రమలమ్మను దవాకాన్ల శెరీకు జేశింర్రు. దానికి కడ్పునొప్పి. ఇయ్యాల్లనా నిన్ననా ఎన్నొద్దుల్నించి అగోరిస్తాంది. మంత్రాలు, తాయితలు ఎన్ని గట్టిచ్చినా తక్వాగాలె. ఎందరి వైద్యుల తాన మందు దిన్నా తక్వగాలె. ఆకాడికి అల్లుడు మంచోడు. నా బిడ్డ ఆగమ్మ పక్షోలె తల్లడిస్తుంటే కొంటవొయి ఉస్మానియల ఏశిండు. పెద్ద డాక్టర్లు జూశి ఆపరేసను జెయ్యాలన్నరు.

ఇగ రేపు ఆపరేసననంగ ఇయ్యాల అంబటాళ అల్లుడు మసూధను ఒచ్చిండు. ఒచ్చి సంగతి శెప్పిండు. ఆపరేసననంగనె నా గుండెల రాయి వడ్డది. అంకమ్మ సోకాలు పెట్టిన. నా బిడ్డ బత్కి బట్ట గడ్తదో లేదో అని మన్సుల రంది పేర్కపోయింది. ముద్దు మురిపెంగ పెంచుకొని, అంగరంగ వైభవంగ పెండ్లి జేస్తె, — ఏమున్నది? దాని సుకం జూడనోసుకోలే. దాని పెయ్యి ఎప్పుడు బాగనే ఉండదాయె. అత్తానదు

వంటిని అల్లుడు ఆగం బెట్టవట్టే–ఇగ నాకూ్కడ కాలు నిల్వలె. బుక్కెడు పెడితె తిన్నడు. తినంగనె బయలెలినం గాచిత్తె ఎండల ఆమ మేఘాల మీద పట్నం జేరుకున్నం.

యాల్లగాని యాల్ల లోపల్కి పొయ్యే ఖానూన్ లేదని వాల్కెంత సేపు అటకాయించిండు–దవాకాన గేటు కాడ ఉండెటోడు! నా బాగెర్ల కొడుకు!! నా బిడ్డ పానం పోతాందిరా నాయన, అయ్య, అప్ప అన్నాగని యిడువలె. ఇగ నా అల్లుడు పట్లోన్ జేబుల కెల్లి అచ్చంగ ఆఠాన పైసలు దీశియ్యంగనె ఖానూనేడ బోయిందో నోరు ముద్దె రేసుకున్నడు. పొయ్యే వరకేమున్నది? ఏం మందులిచ్చిండో, యేం పాడో సొమ్మసిల్లి పన్నది. నా బిడ్డ అంబ్యాదది. ఎట్లయితదో ఏమో అని దుఖం ముంచుకొచ్చింది. గని, మింగిన. బిడ్డకు ధైర్యం జెప్పాలని ఒప్తి. నేనే ఏడిస్తే ఎట్ల?

నేనెన్నడన్న చూసిన దాన్నా చేసిన దాన్నా. అమ్మో, అమ్మో ఏడికేడి కున్నది దావకాన. ఊరు ఊరంత ఉన్నది. పెద్ద డాక్టర్లు, శిన్న డాక్టర్లు సద్వుకునెటోల్లు అందరు రోగుల మంచాల సుట్టు ముసురు కుంటరు. ఊపిరి సలుప నియ్యరు, ఇగ అన్ల పన్జేశెటోల్లున్నరు నాయనా ఇగ శెప్పేటట్టు లేదు. పైసలు నానుపుతనే వుండాలె. లేకపోతె పానంబాయె అన్నాగని ఇటు సూడరు. దొరికిన కాడికి అమిరిచ్చు కుంటారు. అల్ల కకుర్తి అమ్మగాను. పది పైసల కొన్నించి రూపాయ లకు రూపాయలె ఎవ్వలి తాహతును బట్టి అల్లు దిగమిగ్తరు. నర్సుల మ్మలు శిన్న ఒడ్సు గత్తెలు గాదు. డాక్టరుది డాక్టరుకు ఒప్ప జెప్తరు. ఆయన పోయినంక అల్లు జేశేది అల్ల శేస్తరు. ఏంటియో అర కులిస్తరు ఏంటియో సూదులిస్తరు. ఒడ్డి గలు పడున్న నా బిడ్డ అసోంటోల్లను అతల కుతలం జేశి పోతరు.

బీమారి మన్సులకు అన్నం గిట్ట సర్కారే యిస్తదంట.—శరీకు జేసుకున్న రెండ్రోజులకు ఏమేమిదినాల్నో రాస్తడు. ఆయిన రాశిన నాల్రోజులకు నర్సులు జూస్తరు అల్లు జూశిన తెల్లారి అన్నం యిస్తరు మరి యిన్ని రోజులు రోగులు ఎట్ల బత్కాలనుకుంటరో తెల్వదు. బయట్నుంచి అన్నం దీస్కపోతె, తినొద్దని కోప్పడ్తరు. ఇదంత ఎందో తెల్వకుంట ఉన్నది.

ఇగ నన్ను జూసి, అమ్మలక్కలు వాల్లు వీల్లు ఒచ్చి అడిగిరి. బిడ్డకు ఆపరేసనని ఒచ్చినవు గని, "డాక్టర్ను యింటికాడ కల్సుకున్నావా?—" అని అడిగిరి. 'సర్కారి దవాకాన గద యింటికెందుకు బోవాలె'—అని అనంగనె అల్లు ఎగాదిగా జూసుకుంట బొయిండ్రు నాదేమో తెల్వని గోరమాయె. నాకేమెరక? అటుయిటు పక్కోల్లను అడిగితె శెప్పిండ్రు. డాక్సర్ల యిండ్ల మీదకి పోయి యినిన్ని రూపాయలు ముట్ట జెప్పుకోని రాంది గాదట. నా అల్లుడు ఎన్నుంచి తెచ్చిస్తుండు? నౌకరి మామూలుదాయె. నెల జీతం సొంతం యిచ్చినా అల్లకు సరిపోదు.

గివ్వన్ని తెల్వంగనె, మన్సు మన్సుల లేదు. పొద్దాల పొద్దాల్నే తోపుడు బండి మీద కొంచవోయి చిడీలు ఎక్కకుండ అనామతు తీస్క పొయ్యే శిన్న అర్రలకు తోలి, బిస్స ఒత్తి, కన్నుమూశి తెరిశె లోపట పై అంతరానికి జేర్శిండ్రు. మల్లి అన్నించి ఆపరేసను జేశె దాంట్లకు నూకక పొయిండ్రు. మమ్ముల లోపల్కి రానియ్యలె. బయట కూకోమన్నరు. ఏమైతదో అని నా మన్సు అట్టుడికి నట్టుఉడుకుతుంది. ఇంగ 'చా' తాగుతవా అంటని అడిగిండు—అల్లుడు ఒల్లనన్న. ఇద్దరి కిద్దరం పచ్చి మంచినీల్లు ముట్టుకోలె. పన్నెండాయె. ఒంటిగంటాయె, బయటికి తీస్కరాలె. కడుపుల బుగులెక్కవాయె. బిడ్డేమాయెనో అని ఏడ్పొచ్చింది. ముక్కుకు తెల్లబట్ట గట్కోని లోపలికిపొయ్యేటోల్లు ఎవ్వలో నన్ను జూసి ఏడ్వొద్దని కోప్పడ్డరు. అయ్యో రాత

పాడుగాను. నా బిడ్డ నాల్ల శేత్ల బెట్టి ఏడ్శేటందుక్కూడా సతంత్రం లేకపాయె అనుకున్న. మూడు గంటలు కొత్తరనంగ లోపల్కి బిల్శి, ముందటర్రల్నే ఆపి, నా బిడ్డను జూపింద్రు. సప్పుడు లేదు, సరి లేదు. నాకేడ్వాగలె అల్లుడు- 'ఉకో ఎంగాలె మత్తు మీదున్నదని'- అన్నడు. బిడ్డ మీంచి దిప్పి కట్నమియ్య మన్నరు; ఆడ పన్జేశేటోల్లు. శేశేది డాక్టర్లయితే ఈల్లకెంమ కియ్యాల్నో తేల్వలె. నాలుగైదిస్తే తీస్కోలె పది రూపాయలు గుంజిన్రు. అపతి కాలం ఎట్లేట్లా అని మేముంటె అన్యాలం పాడుగాను ఒక్కొక్కలు ఆంబోతులోలె ఉన్నరు... ఒదలకపొయిరి.

నా బిడ్డను ఇగో గదే జూసుడు. తీస్కపోయి లోపటి అర్రల ఏశిండ్రు. మమ్ముల బోనియ్యలె. కడ్పు ఆపరేసనయినోల్లను మూడ్రోజులు అండ్లనే యేస్తరంట. అండ్లని ఏశిండ్రు. మత్తు ఒదిలినంక బిడ్డ మొత్కోబట్టె. బయట కూకున్న నాకు యినరావట్టె గని, అండ్ల పన్జేశేటోల్ల శెవులల్ల సీసం బోసుకున్నరో ఏమో, గిన్ని మంచి నీల్లడిగినా ఇయ్యలె. గిన్ని పాల సుక్కలు బొయ్యలె. నా బిడ్డది గోసంటె గోస కాదు. ఆక్కపక్షోలె తల్లడిచ్చింది. అల్లుడు గిన్ని పాలు కొనుక్కొచ్చిండు తాపిచ్చి వొస్తనంటె లోపల్కి పోనియ్యరు. దాని ఉసురు తలుగ అరిఘోష బెట్టుకున్నరు. అండ్ల ఒగన్కి ఐదు రూపాయలిస్తే, చేతిల పాలు చటుక్కున అందొక్కని తాపిచ్చిండు ఈల్ల దాలాకితనం నాశనంగాను పైసలు గుంజెటందుకు గింత తతంగం జెయ్యాల్నా? ఆపరేసను అయినోల్లను బాగ అరుసుకునెటందుకని, సర్కారోల్లు పతేకం ఓ అర్ర జేస్తె అండ్ల అందరు పని దొంగలె. ఒక్క లొక్కల్ని జూస్తుంటె ఒల్లంత మండ వట్టింది. అల్లమన్సు లెంత నల్లగనో బయటికంత తెల్ల బట్టలూ, కోట్లు కట్టుకుంటరేమో అనిపిచ్చింది.

మూడ్రోజులయినంక బిడ్డను బయటి సాయబాన్లేశిండ్రు. రెండ్రోజుల్నించి జోరుగ వాన గొడ్తాంది. అల్లుడు తడ్సుకుంటనే నౌకరి మీదికి పోయిండు. మూసినదిమీదినించి సల్లగగాడ్పుఒస్తాంది. బిడ్డకునిండగప్పిన.

అసుంట ఎదురుంగ కిరాయి అర్రలున్నయి అండ్ల ఉన్నోలకు నర్సమ్మలు అన్ని అందిస్తనే వుంటరు. పెద్ద పెద్ద డాక్టర్లు రోజు రెండు మూడు సార్లు సూసోని పోతుంటరు యింటికాడ పైసల దిచ్చినోల్ల రోగులను పట్టి పట్టి జూసి పోతరు. మా అసోంటి చిల్లర గాళ్ళ నెందుకు జూస్తరు ? గొప్ప సద్వులు సద్వినోల్ల కూ్కడ గింతగనం పక్షపాత ముంటదనుకోలె గోడలకు జేశిన అస్తరు కారోలె, నున్నగ... సిద్దెకు సిద్దె ఉన్నరు ఆడవున్న సకల సబ్బందు రోగులు ఆల్లను దేవుళ్లోలె జూస్తాండ్రు ఆల్లేమొ మేక తోలు కప్పుకున్న పులులోలె తిరుగు తాండ్రు.

కమలమ్మ అడప. దడప లేశి సూస్తాంది. పాలు తాగుతాంది. రొట్టె తింటాంది. రెండో రోజుకు కొంచెం కోలుకోని లేశి కూసుంది. వొల్లిరిశింది కొంచెం సల్లిడిశి నట్టు అయిందేమో, మొకం మీద జెర్ర తెల్వొచ్చింది. మెల్లెగ నెత్తి ముడుసుకుంది. కొంగు సవరిచ్చుకుంది... మెడ నిమురుకోని "అమ్మా నా పుస్తెల తాడేదే—" అని అడిగింది దవాకాన అనామతు నామీద గూలినట్లయింది.

ఒంటిమీద నగలేంలెవ్వుగా పుస్తె ఎవరుతీస్తరు తీయ్ అనుకున్న గని, అచ్చంగ బంగారి గుండ్లు ఆపరేసను పేరు మీద శెయి జారిపోయి నయి. బయట మాయదారి లోకంల ఎన్ని మోసాలున్నయో, ఇండ్ల అన్ని ఉన్న యనిపించింది. ఇసోంటి వాటికి అగ్గిపెట్టాలనిపిచ్చింది. నోరు లేనోళ్ళ సొమ్ము కొట్కతిని యాపాటి పొడుగైతరు?

నా కండ్లు నిండుగ నిండినై. బయట మూసినది నిండుగ పార్తాంది. ఈల్ల లేకి తనాన్ని, అ శద్దను మాలేశి అలగా జనం పెద్ద యేరోలె ఇయ్యాల్ల గాకపోతే రేపు తప్పక పొంగుతరు. అప్పుడు ఇసు వంటి యన్ని నేలమట్ట మయితయి.

పుస్తె జారిపోయి పరుపుల పడ్డదేమో అని ఎతుక్కుంటాంది, కమ లమ్మ— నా బిడ్డ అంబ్యాదది.

కేకలు
జన్మదిన ప్రత్యేక సంచిక
1975